క్లుప్తంగా

ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలిలోని 182వ పోలింగ్ బూత్ పరిధి ఎగువపేటలో గురువారం ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్‌వో), బూత్ లెవల్ ఏజెంట్(బీఎల్ఏ) అల్లిపిల్లి నర్సింగరావు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తదితరులు ఇంటింటికీ వెళ్లి జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ జాబితాలను ఎంతో జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కిసాన్ సమ్మాన్ నిధులు సద్వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఏడీ విజయ్‌ప్రసాద్

ఆనందపురం: కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న కిసాన్ సమ్మాన్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ భీమిలి డివిజన్ ఏడీ బి.విజయ్ ప్రసాద్ అన్నారు. వేములవలసలోని కిసాన్ సమృద్ధి కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీఎం నరేంద్రమోదీ 14వ విడత కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద అర్హులైన రైతులు ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జమ చేస్తున్నారని చెప్పారు. రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా టీవీలో ప్రచారమైన ప్రధాని మోదీ ప్రసంగాన్ని రైతులతో కలిసి విజయప్రసాద్ తిలకించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ, నాయకులు ప్రసాదరావు పట్నాయిక్, మీసాల రాము నాయుడు, రైతులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాల సందర్శన



రెడ్డిపల్లి కేంద్రం వద్ద మాట్లాడుతున్న విజయానందరెడ్డి

పద్మనాభం: పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా రైతులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తోందని బీజేపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి ఎస్.విజయానందరెడ్డి తెలిపారు. మండలంలోని మద్ది, రెడ్డిపల్లి గ్రామాల్లోని పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోది కొత్తగా కిసాన్ సమృద్ధి కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ కింద రూ.2 వేల జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, పి.వి.వి.ప్రసాదరావు, ఆర్.శ్రీనివాసరావు, హెచ్.మహేష్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

గీతం ఎంబీఏ, బీబీఏ, బీకాం కోర్సుల్లో ప్రవేశాలు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ బిజినెస్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబీఏ, బీబీఏ, బీకాం కోర్సుల్లో ప్రవేశాలకు గానూ విశాఖ ప్రాంగణంలో అడ్మిషన్ కౌన్సిల్‌ను నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర తెలిపారు. ఎంబీఏలో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, సప్‌లైచైన్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్సెస్, బిజినెస్ ఎనలటిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్‌లో స్పెషలైజేషన్‌ను ఆఫర్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

నగరపాలెం రోడ్డుకు మహర్దశ

- 20 నుంచి 40 అడుగులుగా విస్తరణ
- తొలగనున్న స్థానికుల కష్టాలు



ప్రస్తుత కె.నగరపాలెం రహదారి



రోడ్డు విస్తరణకు కొలతలు తీసుకుంటున్న ఏసీపీ శ్రీనివాస్, సిబ్బంది

కొమ్మాది: అసలే ఇరుకైన రోడ్డు.. ఆపై ఒక్క వాహనం వస్తే మరో వాహనానికి ఇబ్బంది. ఇటుగా ప్రయాణించాలంటే ఓ సాహసమే. మా ఊరికి రోడ్డు వెడల్పు చేయాలని కొన్నేళ్లుగా స్థానికులు వేడుకుంటున్నా.. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం రహదారి విస్తరణకు మోక్షం లభించింది.

ఈ రోడ్డుకు మహర్దశ పట్టడంతో స్థానికులతోపాటు వాహనాల రాకపోకలకు కష్టాలు తొలగనున్నాయి. భీమిలి బీచ్ రోడ్డుకు బోయపాలెం జాతీయ రహదారిని అనుసంధానం చేసే మార్గం ఇది. ప్రస్తుతం ఉన్న 20 అడుగులను 40 అడుగుల రోడ్డుగా విస్తరించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. కె.నగరపాలెం నుంచి కాపులుప్పాడ వరకు 3.5 కి.మీ. మేర ఈ రోడ్డు విస్తరణ పనులు జరగనున్నాయి.

స్థానికుల హర్షం

నగరపాలెం రహదారి విస్తరణ వల్ల తమ భూములకు విలువ పెరుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కాంపౌండ్ వాల్స్ చిన్న చిన్న నిర్మాణాలు తొలగించక తప్పని నేపథ్యంలో వాటిని మళ్లీ ప్రభుత్వమే నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ విస్తరణలో వంద గజాలు దాటి రోడ్డు వైండింగ్‌లో కలిస్తే టీడీఆర్ ఇచ్చేందుకు కూడా అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఏసీపీ డి. శ్రీనివాస్, టీపీవో మూర్తిశ్రీ కలిసి రోడ్డు విస్తరణ పనులకు కొలతల పనులు ప్రారంభించారు. త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కానున్నట్లు వీరు తెలిపారు.

ప్రజలు సహకరిస్తున్నారు

కె.నగరపాలెం రోడ్డు విస్తరణ క్రమంలో నిర్మాణాలు, ఇతర తొలగింపులు జరిగినా వాటిని ప్రభుత్వం వెనువెంటనే తిరిగి నిర్మించనుంది. ఈ క్రమంలో స్థానికులు సానుకూలంగానే సహకరిస్తున్నారు. పనులను త్వరలో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డి.శ్రీనివాస్, ఏసీపీ, జోన్–1

ఓటు రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం



ప్రత్యేక ఓటర్ల నమోదులో మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కరరెడ్డి



ఉత్సాహంగా ఓటు నమోదు దరఖాస్తులు నింపుతున్న విద్యార్థినులు

ఆర్డీవో భాస్కరరెడ్డి

మధురవాడ: ఓటు హక్కు భారత పౌరులకు రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం అని భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి చెప్పారు. గురువారం సాయంత్రం మధురవాడ గాయిత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ ఓటర్స్ డ్రైవ్‌కు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సుస్థిరత, శాంతి, అభివృద్ధి, పౌరులకు స్వేచ్ఛ, భద్రత వంటివి బలమైన ప్రభుత్వాలు, ప్రజాస్వామ్య దేశాలకే సాధ్యం అవుతుందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు నమోదు చేసుకోవడంతో పాటు ఓటింగ్‌లో పాల్గొంటే ప్రజాస్వామ్యం మరింత విజయవంతం అవుతుందన్నారు. ఓటు హక్కు వినియోగం, దాని ప్రాధాన్యత గురించి మరింత ప్రచారం జరగాలన్నారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంతంలో 55 శాతం మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. షాపింగ్ మాల్స్ వద్ద వేచి ఉంటున్న చాలా మంది ఓటు వెయ్యడానికి మాత్రం క్యూల్లో నిలబడేందుకు ఇష్టపడటం లేదన్నారు. ఎన్నికల సంఘం మరిన్ని సంస్కరణలు తీసుకురాబోతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో విశాఖ రూరల్ మండల తహసీల్దార్లు సనపల రమణయ్య, కళాశాల ప్రతినిధి సాయిప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం: మండలంలోని బోయిపాలెం సబ్‌స్టేషన్‌లో నిర్వహణ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–3 ఆపరేషన్స్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్త కల్లివానిపాలెం, గంభీరం, బోయిపాలెం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎండాడలో నాగుపాము కలకలం



పట్టుకున్న నాగుపాముతో స్నేక్ క్యాచర్ శ్రీనివాస్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జాతీయ రహదారి సిరిగుడి నగర్‌లోని ఓ మెకానిక్ షెడ్‌లో గురువారం 8 అడుగుల నాగుపాము కలకలం రేపింది. ఇక్కడ నక్కా నూకరాజు మెకానిక్ షెడ్ (జేసీబీ రిపేర్స్) నిర్వహిస్తున్నాడు. యథావిధిగా ఉదయం తన షెడ్‌ను తెరిచేందుకు వెళ్లగా 8 అడుగుల నాగుపాము కనిపించడంతో ఆందోళనకు గురయ్యాడు. వెంటనే స్నేక్ క్యాచర్ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. అతడు పామును చాకచక్యంగా పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాములు ఇలా నివాసాల్లోకి చేరుతాయని, ఎవరికైనా కనిపిస్తే తనకు సమాచారమివ్వాలని శ్రీనివాస్ తెలిపారు. పట్టుకున్న పామును ఎవరూ లేని నిర్మానుష్య ప్రాంతంలో విడిచిపెట్టారు.

ఒత్తిడిని జయిస్తే మానసిక రోగాలు దూరం



మాట్లాడుతున్న మానసిక ఆరోగ్యాధికారి తేజస్విని

ఆనందపురం: ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకుంటే మానసిక రోగాలు దరిచేరవని జిల్లా మానసిక వైద్య ఆరోగ్యాధికారి ఎస్.తేజస్విని అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య సిబ్బందికి మానసిక వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విషయానికి ఒత్తిడికి గురికాకుండా, ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించాలని సూచించారు. మానసిక ఇబ్బందులు ఉన్న వారిని గుర్తించి ఒంటరి తనం నుంచి ముందు దూరం చేయాలన్నారు. అన్ని వయసుల వారికి మానసిక రుగ్మతులు వస్తాయని, అలాంటి వారిని గుర్తించి సమాచారమిస్తే నెలకు ఒక రోజు శిబిరం నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తామని తేజస్విని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.గంగునాయుడు, జిల్లా ఆస్పత్రుల కన్వీనర్ రమేష్ కిషోర్, సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, సోషల్ వర్కర్ గేదెల సత్తిబాబు, ఎంఎల్‌హెచ్‌సీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



భీమిలిలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు, బాలలు



చంద్రంపాలెం హైస్కూల్లో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పౌర సంఘం నాయకులు

భీమునిపట్నం: భీమిలిలోని వైఎస్సార్‌సీపీ విద్యార్థి నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, ఆర్.ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో గురువారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలాం మన దేశానికి అత్యుత్తమ సేవలందించారని కొనియాడారు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని. అటువంటి గొప్ప వ్యక్తిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొంకి వెంకటేష్, సిహెచ్.రాజశేఖర్, ఎల్.సంతోష్, ఎ.కృష్ణ, జె.సురేష్, టి.కుమార్, ఆర్.మోహన్, జె.శ్రీను, ఎం.గౌరి, శంకర్ పాల్గొన్నారు.

- జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.సూర్యప్రసాద్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలాం గొప్పతనం గురించి మాట్లాడారు. అధ్యాపకులు పి.వేణుగోపాల్, కె.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో..

తగరపువలస: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ సూర్యప్రసాద్, ఎస్ఎస్ఎస్ పీవో వేణుగోపాల్, మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, హిందీ విద్యార్థులు పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం

మధురవాడ: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమైనవని మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. గురువారం సాయంత్రం చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఆవరణలోని కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సైన్స్ మ్యాన్‌గా పేరొందిన కలాం నేటి తరానికి ఆదర్శమన్నారు. సంఘ అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంతో కార్యవర్గ సభ్యులు బెల్లాపు పాపారావు, జగన్ మోహన చౌదరి, బైపిల్లి సతీష్‌కుమార్, మామిడి వరలక్ష్మి, కాకి నాగేశ్వరరావు, కావ్యారెడ్డి, శ్రీనివాస రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

‘గోస్తనీ’కి జలకళ



గోస్తనీ నదిలో ప్రవహిస్తున్న నీరు

పద్మనాభం : గత ఐదు రోజుల నుంచి ఏకధాటిగా వర్షాలు కురుస్తుండటంతో గోస్తనీ నదికి కళకళలాడుతోంది. గతంలో ఈ నది ఎప్పుడూ నీరు లేక వెలవెలబోయేది. వర్షాలు కుమ్మరించడంతో నదిలో నీరు ప్రవహిస్తోంది. మండలంలోని విలాస్కాన్‌పాలెం, పొట్నూరు, మద్ది, కృష్ణాపురం, పాండ్రంగి, మునివానిపాలెం, సామయ్యవలస గ్రామాలను ఆనుకుని గోస్తని నదీ తీరం ఉంది. నదిలో నీరు పుష్కలంగా ఉండటం వల్ల గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో భూగర్భ జలాలు అభివృద్ధి చెంది వ్యవసాయ పంపు సెట్లకు సమృద్ధిగా నీరు అందుతుంది.

కూలే స్థితిలో విద్యుత్ స్తంభం



మధురవాడలో స్తంభం దుస్థితి

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు మధురవాడ డీ మార్ట్ వెనుక వర్షానికి కోతకు గురై ఓ విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. ఎస్‌టీఆర్‌సీ/89/19 నంబర్ గల కరెంట్ స్తంభానికి రక్షణగా కర్రలు అడ్డు పెట్టారు. దీంతో ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు బిక్కు బిక్కుమంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



వివిధ మొక్కలతో గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, విద్యార్థులు

మధురవాడ: విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ఏఐసీటీఈ ప్రారంభించిన మేరీ లైఫ్ మాసివ్ ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్–2023లో భాగంగా మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఏబీ కోటేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జూన్ 5న వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే సందర్భంగా ఏఐసీటీఈ ఆధ్వర్యంలో పర్యావరణ సంరక్షణ కోసం దేశమంతటా ఒక కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. చెట్టమ్మ చెట్టమ్మ అనే నినాదంతో ప్రతి విద్యార్థి ఒక్కో మొక్క నాటడానికి ప్రోత్సహిస్తునట్టు తెలిపారు. కళాశాల ఆవరణలో వేప, రోస్, జొప్పాయి, కరివేపాకు, మునగకాడ వంటి 100 రకాల మొక్కలను విద్యార్థులు నాటినట్లు చెప్పారు. కార్యక్రమంలో జీవీపీ ఎడ్మిన్ డీన్ అచ్యుత రామం, సీఎఫ్ఎస్ఆర్ అసోసియేట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, సీహెచ్ రాజేశ్, ఎన్ఎస్ఎస్, రోట్రాక్ట్, ఎస్ తదితర వలంటీర్ ఆర్గనైజేషన్లకు చెందిన విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వేములవలసలో కాలువల పునర్నిర్మాణానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



వేములవలస జంక్షన్‌లో ప్రారంభమైన పనులు

ఆనందపురం: మండలంలోని వేములవలస ప్రధాన రహదారిలో వరద నీటి ప్రవాహ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. వరద నీరు నేరుగా గ్రామంలోకి ప్రవేశించడంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ నెల 25న ‘వేములవలసను ముంచెత్తిన వరద నీరు’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం గతంలో పూడికపోయిన కాలువలను పునరుద్ధరించడానికి యంత్రాల సాయంతో తవ్వకాలు జరుపుతున్నారు. పాత వాటిని పునరుద్ధరించడంతోపాటు అవసరమైతే కొత్త కాలువలు నిర్మించడానికి చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు చెప్పారు. పనులు పూర్తయితే స్థానికులకు ఇక్కట్లు తప్పనున్నాయి. కార్యక్రమంలో కార్యదర్శి నరిసింగరావు, నాయకులు కోరాడ రాంబాబు, కోరాడ అప్పలస్వామి నాయుడు, ఆర్ అండ్ బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

రోడ్లపై రవాణా వాహనాలు నిలిపితే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



సంతపేట రెడ్డి వీధిలో గొడౌన్ యజమానిని హెచ్చరిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు

తగరపువలస: సంతపేట రెడ్డి వీధి రహదారిలో గంటల తరబడి రవాణా వాహనాలను నిలిపివేస్తూ ఇతర వాహన చోదకులకు ఇబ్బంది కలిగిస్తున్న గొడౌన్ యజమానులకు భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు హెచ్చరించారు. ‘ఇరుకు రోడ్లపై రవాణా వాహనాల నిలిపివేత’ శీర్షికన గురువారం ‘సాక్షి’లో ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. లోడింగ్, అన్‌లోడింగ్ వంటి పనులు రాత్రివేళలో నిర్వహించుకోవాలని సూచించారు. పగటివేళ మిగిలిన వాహన చోదకులకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై వాహనాలు ఆపితే చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ప్రజలు, వ్యాపారులు భీమిలి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

రీసర్వేపై గ్రామసభలో రైతుల అభ్యంతరాలు



ప్రజాప్రతినిధులు, రైతులతో మాట్లాడుతున్న భీమిలి తహసీల్దార్ వేణుగోపాల్

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో సమగ్ర భూ రీసర్వే సందర్భంగా గురువారం నిర్వహించిన గ్రామసభలో కొందరు రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల పంచాయతీలో జరిగిన రీసర్వేలో భాగంగా డ్రాఫ్ట్ కాపీని అధికారులు సచివాలయం నోటీస్ బోర్డులో ఉంచారు. దీనిపై కొందరు రైతులకు ఈ వివరాలు అర్థం కాకపోవడంతోనే అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు మిగిలిన రైతులు అంటున్నారు. కొందరు రైతులకు భూమి హక్కులకు సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలు కూడా లేవన్నారు. ఈ సందర్భంగా భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి సచివాలయంలో సర్వేయర్లను అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులకు రీ సర్వేపై ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలని సూచించారు. అవసరమైతే అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతుల భూములను పరిశీలిస్తామన్నారు. రైతుల తరఫున గ్రామసభలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, కేపీ సత్యనారాయణ, గాడు తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమలకు చెక్



కొమ్మాది చెరువులో గంబూషియా చేప పిల్లలను విడిచిపెడుతున్న అధికారులు

కొమ్మాది: దోమలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వైఎస్సార్‌సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు అన్నారు. గురువారం వార్డులోని బావులు, చెరువుల్లో గంబూషియా చేప పిల్లలను అధికారులతో కలిసి ఆయన విడిచిపెట్టారు. గంబూషియా చేపలతో దోమల వృద్ధిని నియంత్రించవచ్చని వారు చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడా నీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమం వేగవంతం చేస్తున్నామని తెలిపారు. శానిటేషన్ సిబ్బందితోపాటు స్థానిక నాయకులు గుంటుబోయిన సంజీవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి సీపీఐ బస్సు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి పైడిరాజు

మధురవాడ: ‘రాష్ట్రాన్ని రక్షించండి–దేశాన్ని కాపాడండి’ అనే నినాదంతో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 6 వరకు బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు చెప్పారు. 16న కూర్మన్నపాలెం నుంచి ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని, అంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మధురవాడలో గల పార్టీ కార్యాలయం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పూర్తి చేయడానికి ప్రభుత్వానికి ఎన్నేళ్లు పడుతుందని ప్రశ్నించారు. 4 వేల మంది విద్యార్థులున్న చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల వద్ద హైవేపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయమంటే రోడ్డు దాటడానికి అవకాశం లేకుండా ఐరన్ గ్రిల్స్ వేసేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పూర్తి చేయడానికి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎండీ బేగం, వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులకు ఆటంకం



వర్షపు నీటి ధాటికి కోతకు గురైన గోస్తనీ నదికి అడ్డంగా వేసిన మట్టి కట్ట

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గొల్లలపాలెం నుంచి ఎల్లారమ్మ మెట్టకు అనుసంధానంగా రూ.2.96 కోట్లతో గోస్తనీ నదిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులకు ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడింది. ఆరు మాసాల్లో పూర్తి కానున్న వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా ఇటీవల గొల్లలపాలెం వద్ద 20 అడుగుల లోతైన ప్రాంతం నుంచి 300 లారీల మట్టితో అడ్డుకట్టు వేసి నదిలో నీరు పోవడానికి పైపులు వేశారు. మరో 700 లారీల వరకు మట్టిని వేసి రెండు నెలల తరువాత వంతెన 9 పిల్లర్లతో నిర్మాణం ప్రారంభం కావలసి ఉంది. ఇటీవల వరుసగా వర్షాలు కురవడంతోపాటు తాటిపూడి రిజర్వాయర్ నుంచి పెద్ద ఎత్తున నీరు విడుదల కావడంతో నది మధ్యలో మట్టి దిగువ భాగానికి కొట్టుకుపోయింది. దీంతో తాత్కాలికంగా వంతెన నిర్మాణ పనులు వాయిదా పడ్డాయి.